8న గుట్టకు మాజీ మంత్రి హరీశ్‌రావు రాక

యాదగిరిగుట్ట, మే 28: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామివారి గిరిప్రదక్షిణలో మాజీ మంత్రి హరీశ్‌రావు పాల్గొనున్నట్లు బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వామివారి దర్శనానంతరం పట్టణంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో యాదగిరిగుట్టకు మంజూరు చేసిన వైద్యకళాశాల ఏర్పాటు చేయాలని కోరుతూ బీఆర్ఎస్ పార్టీ మండలశాఖ ఆధ్వర్యంలో మహాధర్నాలో పాల్గొంటారని అన్నారు. వైద్య కళాశాల ఏర్పాటు చేయాలని పరిపాలనా అనుమతులు మంజూరు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు వైద్యకళాశాలకు శంకుస్థాపన చేయడంలేదని దీనిపై మంత్రి హరీశ్‌రావు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ప్రశ్నించనున్నారని అన్నారు.

టీజేఎఫ్ రజతోత్సవ సభకు తరలిరండి

పోస్టర్‌ను విడుదల చేస్తున్న తహసీల్దార్ లావణ్య
డిప్యూటీ తహసీల్దార్ సఫియుద్దీన్,ఆర్ఐ మల్లికార్జునరావు తదితరులు

ఆత్మకూరు (ఎం) మే 28 : తెలంగాణ కోసమే తెలంగాణ జర్నలిస్టులు అనే నినాదంతో ఆవిర్భవించిన తెలంగాణ జర్నలిస్టు ఫోరం(టీజేఎఫ్) 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్నది. సందర్భంగా మీడియా అకాడమీ మాజీ చైర్మన్ , టీజేఎఫ్ వ్యవస్థాపకులు అల్లం నారాయణ ఆధ్వర్యంలో ఈ నెల 31 హైదరాబాద్ జలవిహార్‌లో సభ నిర్వహిస్తున్నది. ఈ రజతోత్సవ సభకు మండలం నుంచి జర్నలిస్టులు పెద్ద ఎత్తున తరలిరావాలని టీయూడబ్ల్యూజే (H-143) మండల అధ్యక్షుడు ఎలిమినేటి నగేశ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు రేగోటి పాండురంగం పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో తహసీల్దార్ లావణ్య డిప్యూటీ తహసీల్దార్ సఫియుద్దీన్,ఆర్ఐ మల్లికార్జునరావుతో పాటు యూనియన్ నాయకులతో కలిసి రజతోత్సవ సభ ప్రచార పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో చెరుకు మల్లేశ్, లోడి భాస్కర్, కాడిగళ్ల వెంకటేశ్,గాడిపల్లి ఉదయ్ కుమార్, మామిడి ఇంద్రారెడ్డి, బబ్బూరి శివ లింగం తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా జయప్రదం చేయండి

భువనగిరికలెక్టరేట్, మే 28 : ఉపాధిహామీ చట్టం రక్షణకై ఈ నెల 30న కలెక్టర్ కార్యాలయం ముందు నిర్వహిస్తున్న ధర్నాలో ఉపాధి కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పల్లెర్ల అంజయ్య పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని హన్మాపురం గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పని ప్రదేశానికి వెళ్లి కార్మిక సమస్యలను తెలుసుకొని అనంతరం నిర్వహించిన కార్యక్రమాన్ని ఉద్దేశించి అంజయ్య మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ మోడీ ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుండి పెట్టుబడిదారులకు, కార్పొరేట్ శక్తులకు రాయితీలు కల్పిస్తూ పేదలపై భారాన్ని మోపుతున్నారన్నారు. గ్రామీణ పేదలకు బువ్వ పెడుతున్న ఉపాధి హామీ చట్టాన్ని ఎత్తివేయాలనే కుట్రలు చేస్తున్నారని, ఈ కుట్రలకు వ్యతిరేకంగా ఉపాధి హామీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చేపట్టే ధర్నాలో ఉపాధి కూలీలు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు.కార్యక్రమంలో జీఎంపీఎస్ జిల్లా అధ్యక్షులు దయ్యాల నర్సింహ, మాజీ ఎంపీటీసీ దయ్యాల లక్ష్మి, కార్మికులు తుమ్మేటి సునీత, సప్పిడి బాలమ్మ, రంగ గంగమ్మ, తోటకూరి లక్ష్మి, ముద్దసాని పద్మ, పన్నాల హరిత, రంగ శోభ, రంగ మనమ్మ, దుర్గం లక్ష్మి, మిరియాల కళమ్మ, దయ్యాల ఉమ, అమ్మగంటి సరిత, దుర్గం బాలమ్మ, సత్తమ్మ, భాగ్యరేఖ, హేమలత పాల్గొన్నారు.

ఈ నెల 31నుంచి ఆలయ వార్షికోత్సవం

మోత్కూరు, మే 28: మండలంలోని రాగిబావి గ్రామంలో కొలువైన భక్తాంజనేయ స్వామి దేవాలయ 13వ వార్షికోత్సవాలు ఈ నెల 31నుంచి జూన్ 2వ తేదీ వరకు జరుగనున్నాయని గ్రామ మాజీ సర్పంచు రాంపాక నాగయ్య బుధవారం ప్రకటనలో తెలిపారు. ఆలయ ఆవరణలో నూతనంగా పరమేశ్వర, నందీశ్వర, నాగదేవత విగ్రహాల ప్రతిష్ట చేయనున్నట్లు తెలిపారు. ఉత్సవాల్లో మండల పరిసర ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

కలెక్టర్ హనుమంతరావు

మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతరావు, పాల్గొన్న అధికారులు, డీలర్లు

భువనగిరికలెక్టరేట్, మే 28 : జిల్లాలో కల్తీ ఎరువులు, నకిలీ విత్తనాలు అమ్మినా, అధిక ధరలకు విక్రయించినా కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హనుమంతరావు హెచ్చరించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ అనుసంధానంతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఎరువుల డీలర్లు, విత్తన డీలర్లు, మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులతో ఆయిల్ పామ్ సాగుపై రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డితో కలిసి పాల్గొని మాట్లాడారు. వానాకాలం ప్రారంభమవుతున్నందున అందుకు అనుకూలంగా ప్రణాళికలు రూపొందించుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రైతులకు నకిలీ విత్తనాలు, ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఫర్టిలైజర్ షాపుల యజమానులు షాపుల్లో లైసెన్సులు, స్టాక్ రిజిస్టర్లు, బిల్ రిజిస్టర్లు, యూరియా, డీఏపీ, తదితర పురుగుల మందులు స్టాకులను సీడ్స్ డీలర్స్ పక్కాగా మెయింటెనెన్స్ చేయాలన్నారు. లేనిపక్షంలో సంబంధిత వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ధరల పట్టిక, విత్తన ప్యాకెట్ల వంటి స్టాక్ వివరాలు, షాపుల ముందు బోర్డులపై ఉంచాలన్నారు. మండల స్థాయిలో వ్యవసాయ అధికారులతో ఎప్పటికప్పుడు రైతులతో సమన్వయం చేసుకుంటూ విత్తనాల కొరత లేకుండా చూడాలన్నారు. జిల్లాలో విత్తనాలు, ఎరువుల కొరత లేదని అన్నీ సిద్ధంగా ఉన్నాయని తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగు ప్రోత్సహించేందుకు ఎకరానికి రూ.50,918 వరకు రాయితీ ఇవ్వడం జరుగుతుందని, మొక్కలు, డ్రిప్ ఇరిగేషన్, మొదటి నాలుగు సంవత్సరాల పాటు తోటల యాజమాన్యం, అంతరపంటల సాగు కొరకు రాయితీ వర్తిస్తుందన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025-26 ఆయిల్ పామ్ విస్తరణ పథకం క్రింద 3500 ఎకరాలు భౌతిక లక్ష్యాన్ని నిర్దేశించడం జరిగిందని ఈ లక్ష్యాన్ని చేరుకోడానికి ఉద్యాన శాఖ, వ్యవసాయ శాఖ, టీజీ ఆయిల్ ఫెడ్ అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. అనంతరం ఈ-పాస్ మిషన్లను డీలర్లకు అందజేసి, ఆయిల్ పామ్ సాగు పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్, ఉద్యాన శాఖ అధికారి సుభాషిణి, ఏడీఏ నీలిమ, మండల వ్యవసాయ అధికారులు, డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

వలిగొండ, మే 28: ఆర్థిక ఇబ్బందులు తాళలేక పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి దవాఖానలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. బుధవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గుర్నాథ్‌పల్లి గ్రామానికి చెందిన పంతుల రఘుపతి(42) రైతు తనకున్న ఆరు ఎకరాల వ్యవసాయ భూమిలో వరి పంట వేశాడు. వరి పంట అనుకున్నంత దిగుబడి రాకపోవడంతో పంట పెట్టుబడి కోసం చేసిన అప్పులు తీర్చేమార్గం లేక మానసిక వ్యధతో జీవితం మీద విరక్తిచెంది ఈ నెల 24న ఇంటిలో గడ్డిమందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం గమనించిన కుటుంబ సభ్యులు బాధితున్ని చికిత్స నిమిత్తం భువనగిరి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని కామినేని దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్సై యుగంధర్ తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

వలిగొండ, మే 28: పేకాడుతూ బెట్టింగ్‌కు పాల్పడుతున్న ఆరుగురు పట్టుబడిన ఘటన మండలంలోని దుప్పెల్లి గ్రామ పరిధిలో చోటు చేసుకుంది. బుధవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని దుప్పెల్లి గ్రామ శివారులో ఆరుగురు మనీ బెట్టింగ్‌కు పాల్పడడంతోపాటు నిషేధిత పేకాడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు స్థానిక పోలీసులు దాడి చేసి ఆరుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ. 7,800, ఆరు స్మార్ట్‌ఫోన్లు సీజ్ చేసి నిందితులపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్సై యుగంధర్ తెలిపారు.

జూన్ 3న గుట్టలో రైతు మహాధర్నా

బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య

యాదగిరిగుట్ట, మే 28: రాష్ట్ర తొలిసీఎం కేసీఆర్ రైతులకు అందజేసిన రైతుబంధును అడ్డుకున్న కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా జూన్ 3న పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతు మహాధర్నా నిర్వహిస్తున్నట్లు బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. యాదగిరిగుట్ట మండలంలో కేవలం ఆయన స్వగ్రామమైన సైదాపురానికి మాత్రమే రైతుభరోసా అమలు చేసి మిగతా గ్రామాలకు అమలు చేయకుండా ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అడ్డుకుంటున్నారని అన్నారు. సైదాపురం గ్రామస్తులు మాత్రమే ఓట్లేసి గెలిపించారా? లేక ఆయన కేవలం సైదాపురానికే ఎమ్మెల్యేగా వ్యవహరిస్తారా.. తేల్చుకోవాలన్నారు. ఆయన స్వగ్రామంలో వందశాతం రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు మంజూరు చేసి నియోజకవర్గంలోని మిగతా గ్రామాలకు ఎందుకు అమలు చేయడం లేదో చెప్పాలన్నారు. గతేడాది వర్షాకాలం పంటకు పెట్టు బడిసాయం రాలేదని, తాజాగా ఈఏడాది వర్షాకాలం దగ్గరకు వస్తున్నా ఇప్పటి వరకు పెట్టుబడి సాయం ఊసెత్తడం లేదన్నారు. మండలంలోని అన్ని గ్రామాల రైతులకు బేషరతుగా పెట్టుబడి సాయం మంజూరు చేయాలని కోరు తూ జూన్ 3న యాదగిరిగుట్ట తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించే రైతు మహాధర్నా విజయవంతం చేయాలని రైతులకు పిలుపునిచ్చారు.

సంచార జాతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

బీసీ సంక్షేమ శాఖ అధికారి యాదయ్య

భువనగిరి కలెక్టరేట్, మే 28 : సంచార జాతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషిచేస్తుందని బీసీ సంక్షేమ శాఖ అధికారి యాదయ్య పేర్కొన్నారు. బుధవారం తాజ్‌పూర్ గ్రామంలో ఆత్యంత వెనుకబడిన పెద్దమ్మల సంఘం సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. సంచార జాతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం రుణ సహాయాలు, ఆర్థిక వెసులుబాటును కల్పిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంచార జాతుల అధ్యక్షుడు నరేందర్, సంచార జాతుల మహిళా అధ్యక్షురాలు కోట అనిత, మంగమ్మ, నాగేశ్వరరావు, వెంకటేష్, గోవర్ధన్, గంగాధర్, నర్సింహ, రూపేష్, తదితరులు పాల్గొన్నారు.

యాదగిరిగుట్టపై సురక్షా ఉద్యోగుల చేతివాటం

పది బస్తాల చింతపండు చోరీకి యత్నం

వివరాలు వెల్లడించిన డీఈవో భాస్కర్‌శర్మ

చోరీకి వినియోగించిన కారు

యాదగిరిగుట్ట, మే 28: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో పనిచేసే సురక్షా సిబ్బంది తన చేతివాటాన్ని ప్రదర్శించి అడ్డంగా బుక్కయ్యారు. మంగళవారం అర్ధరాత్రి సమయంలో స్వామి వారి ప్రసాదాలకు వినియోగించే చింతపండు బస్తాలను దొంగిలించేందుకు యత్నించారు. డీఈవో దోర్బల భాస్కర్‌శర్మ వివరాలు వెల్లడించారు. కొండపైన స్వామివారి ప్రసాద విక్రయశాలలోని గోదాంలో స్వామివారి పులిహోరలో వినియోగించే సుమారు 30 కిలోలు గల 10 బస్తాల చింతపండును ప్రసాద విక్రయశాలలో పనిచేసే మధు, గణేశ్ అనే సురక్షా సిబ్బంది కన్వేయర్ బెల్టు సాయంతో కారులో వేసుకుని బయటకు వెళ్లే ప్రయత్నం చేశారు. అదే సమయంలో అక్కడికి చేరుకున్న ఎస్పీఎఫ్ సిబ్బంది కారును చూసి అడ్డుకునే ప్రయత్నం చేయగా కారుతోపాటు అందులో ఉన్న చింతపండు బస్తాలను వదిలేసి పారిపోయారు. ఘటనకు పాల్పడిన ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పోలీసులు పట్టుకున్నారు. వీరిపై యాదగిరిగుట్ట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. ఘటనపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని డీఈవో వెల్లడించారు.

విచారణ చేపట్టాలి

దేవస్థానానికి సంబంధించిన చింతపండు దొంగతనంలో ఆలయ ఉన్నతస్థాయి అధికారుల హస్తం ఉన్నట్లుగా అనుమానాలు వస్తున్నాయని బీఆర్ఎస్ పార్టీ పట్టణ సెక్రటరీ జనరల్ పాపట్ల నరహరి అన్నారు. బుధవారం కొండపైన ఘటనాస్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్ధరాత్రి సమయంలో గోదాం, ప్రసాద తయారీ కేంద్రాల తలుపులు, తాళాలు తీసి ఉండటంపై పలు అనుమానాలకు తావిస్తున్నాయన్నారు. ఘటన జరిగే సమయంలో సీసీ కెమెరాలు ఎందుకు పనిచేయకుండాపోయాయో అర్థం కావడం లేదన్నారు. దొంగతనానికి ఉపయోగించిన కారు అర్ధరాత్రి సమయంలో కొండపైకి ఎలా వెళ్లిందో ఆలయ అధికారులు విచారణ చేపట్టాలన్నారు.

చేనేత కళాకారుల నైపుణ్యం అద్భుతం

చేనేత మగ్గాన్ని పరిశీలిస్తున్న ఆఫ్రికా బృందం సభ్యులు

భూదాన్‌పోచంపల్లి, మే 28 : చేనేత కళాకారుల నైపుణ్యం అద్భుతమని ఆఫ్రికా బృందం కొనియాడింది. బుధవారం గ్రామీణ పర్యాటక కేంద్రమైన భూదాన్‌పోచంపల్లిని 15 దేశాలకు చెందిన 30 మంది అధికారుల బృందం సందర్శించారు. టూరిజం పార్క్‌లోని భూదానోద్యమం, చేనేత వస్త్రాల తయారీ ప్రక్రియలను వారు పరిశీలించారు. చేనేత మగ్గాలపై తయారవుతున్న పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలను తిలకించారు. స్థానిక కళా పునర్వ్యవస్థీకరణ యూనిట్‌లో దారం నుంచి చీర తయారీ వరకు జరుగుతున్న పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కళాకారులు రూపొందించిన పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలను చూసి ఆశ్చర్యానికి గురయ్యారు. సంప్రదాయ వారసత్వ చేనేత కళతో తెలుగు సంస్కృతీ సంప్రదాయాల వస్త్రాల డిజైన్లు చూసి ప్రశంసించారు. పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలకు ప్రపంచ దేశాల్లో మంచి గుర్తింపు లభిస్తుందని, వస్త్రాలకు ప్రచారం పెరిగి మార్కెటింగ్‌తో ఆదరణ లభిస్తుందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఐదు రోజుల పర్యటనలో భాగంగా నాలుగో రోజు పోచంపల్లికి విచ్చేశారు. పర్యాటక ప్రదేశాలు, సంస్కృతీ సంప్రదాయాలను క్షేత్రస్థాయిలో తెలుసుకున్నారు.

చేనేత వస్త్రాల ఎగుమతులు ప్రమోట్ చేయాలి

భూదాన్ పోచంపల్లి, మే 28 : మారుతున్న ఫ్యాషన్లకు అనుగుణంగా నూతన డిజైన్లు నాణ్యతతో వస్త్రాల రూపొందించి చేనేత వస్త్రాల ఎగుమతులు ప్రమోట్ చేయాలని జగదీశ్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జగదీశ్ అన్నారు. బుధవారం భూదాన్ పోచంపల్లిలోని టై అండ్ డై అసోసియేషన్ భవనంలో జగదీశ్ ప్రైవేట్ లిమిటెడ్, తెలంగాణ స్టేట్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ (టీజీటీపీసీ), టై అండ్ డై అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఎంఎస్ఎంఈ, రైసింగ్ అండ్ యాక్సిల రేటింగ్ (ర్యాంపు) పై చేనేత వ్యాపారులు కార్మికులు కళాకారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎగుమతుల ప్రమోషన్ వల్ల పోచంపల్లి వస్త్ర పరిశ్రమ వారసత్వ నైపుణ్యాలు కాపాడుకోవడంతోపాటు ఆర్థిక అభివృద్ధికి ఉపయోగపడుతుందని అన్నారు. జీఐ ట్యాగ్ కలిగిన పోచంపల్లి ఇక్కత్ టెక్నాలజీ, ఇంటలెక్టెడ్ ప్రాపర్టీ రైట్సు ప్రాచుర్యంలోకి తేవడంతో ప్రాంత ప్రజలు సమిష్టిగా ప్రయోజనం పొందుతారని పేర్కొన్నారు. చేనేత వస్త్రాలను ఎగుమతులు చేయడానికి ఉత్పత్తిదారులకు కావలసిన సర్టిఫికెట్లు విధి విధానాలు తెలియజేశారు. టై అండ్ డై అసోసియేషన్ అధ్యక్షుడు భారత లవకుమార్, జిల్లా చేనేత జౌళి శాఖ ఏడీ శ్రీనివాస్, పోచంపల్లి బ్యాంక్ చైర్మన్ తడక రమేష్ ,జిల్లా పరిశ్రమ శాఖ సూపరింటెండెంట్ జంగయ్య, ఫర్గెన్ ట్రేడ్ డెవలప్మెంట్ ఆఫీసర్ పీఎస్ బీ శాస్త్రి, జగదీష్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో ఎస్. దీపిక, డిప్యూటీ సీఈవో హేమలత, ప్రతినిధులు శ్రీదే వి, కర్నాటి బాలరాజు, రమాశంకర్, కొండల్, శివ కుమార్, రమేష్, ముసుకూరి నరసింహ, ఈపూరి ముత్యాలు, తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

WANTED TEACHERS
Wanted Teachers: Devarakonda, Mathes, English, Social, Hindi, Science, Contact: 9603864518.

PLOT FOR SALE
★సాగర్ హైవే, విజయవాడ హైవేలలో తక్కువ ధరలో అపార్ట్‌మెంట్ ప్లాట్లు, Indp. ప్లాట్లు & ఓపెన్ ప్లాట్లు HMDA/DTCP అప్రూవల్ LRS గల ప్లాట్లు కలవు. 9603444402.
NT-331100

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/- ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available Minimum 4 Lines, Extra Line - Extra Amount 5% GST అదనం
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, గ్రా॥ చర్లపల్లి, మం॥ నల్లగొండ.
నల్లగొండ: 9182777625, 9182777635 | దేవరకొండ: 9182777635
హాలియా: 9182777059 | సూర్యాపేట: 9182777630 | భువనగిరి: 9182777638
మిర్యాలగూడ: 9182777059 | కోదాడ: 9182777630 | చౌటుప్పల్: 9182777638

మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతరావు

అవతరణ వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేయాలి

అధికారులకు కలెక్టర్ ఆదేశాలు

భువనగిరికలెక్టరేట్, మే 28 : జూన్ రెండు రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు పురస్కరించుకుని పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ హనుమంతరావు అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ చాంబర్‌లో అన్ని శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. జిల్లా కలెక్టరేట్ ఆవరణలో జరిగే రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల సందర్భంగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై ఆయా శాఖల వారీగా అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా అట్టహాసంగా వేడుకలు జరిగేలా ఆయా శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ, డీఆర్డీఓ నాగిరెడ్డి, కలెక్టరేట్ ఏఓ జగన్మోహన్‌ప్రసాద్, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

అసత్యపు ఆరోపణలు ప్రచురించడం సరైందికాదు

ఆంధ్రజ్యోతి దినపత్రిక ఎండీ రాధాకృష్ణ చిత్రపటాన్ని దహనం చేస్తున్న జాగృతి జిల్లా నాయకులు

భువనగిరి అర్బన్, మే 28: తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పై ఆంధ్రజ్యోతి దినపత్రిక ఎండీ.రాధాకృష్ణ నిజాలు తెలుసుకోకుండా అసత్యపు ఆరోపణలు ప్రచురించడం సరైందికాదని జాగృతి జిల్లా అధ్యక్షుడు సీహెచ్.సుజిత్‌రావు అన్నారు. బుధవారం పట్టణంలోని వినాయక చౌరస్తాలో రాధాకృష్ణ చిత్రపటాన్ని దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ కవిత కాంగ్రెస్ పార్టీలోకి వెళ్తారని అసత్యపు ఆరోపణలు చేసి రాజకీయ భవిష్యత్తుపై దెబ్బతీసే ప్రయత్నం చేయడం బాధాకరమని అన్నారు. ఎటువంటి వాస్తవాలు తెలుసుకోకుండా రాయడం మంచిది కాదని, తెలుసుకుని రాయాలని రాధాకృష్ణను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు టి.శ్రీకాంత్, ఎం.సంతోష్, చక్రవర్తి, ప్రభాకర్, వినయ్, మహేష్, భాను, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురు అరెస్ట్

మోత్కూరు, మే 28: మోత్కూరు మున్సిపాలిటీ కేంద్రంలో గంజాయి తరలిస్తున్న ముగ్గురిని పోలీసులు పట్టుకున్నారు. బుధవారం పట్టణంలో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా ముగ్గురు యువకులు బైక్‌పై వస్తున్న వారిని గమనించి తనిఖీ చేశారు. వారి వద్ద 100 గ్రాముల గంజాయి లభించింది. పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారించి బైక్‌ను స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై డి నాగరాజు తెలిపారు.

ఘనంగా వీర సావర్కర్ జయంతి

వీర సావర్కర్ జయంతిలో పాల్గొన్న ఉత్సవ సమితి సభ్యులు

భువనగిరి అర్బన్, మే 28: స్వాతంత్ర్య సమరయోధుడు వీరసావర్కర్ 142వ జయంతిని భువనగిరి పట్టణ సావర్కర్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో పట్టణంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సావర్కర్ చౌరస్తాలోని ఆయన విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సావర్కర్ ఉత్సవ సమితి సభ్యులు సుర్వి శ్రీనివాస్, సాల్వీర్ శ్రీనివాస్, మెరుగు మధు, పోల శ్రీనివాస్, రత్నపురం బలరాం, నర్ల నర్సింగ్ రావు, నీలం రమేష్, పాదరాజు ఉమాశంకర్, జనగాం నర్సింహాచారి, నల్లమాస వెంకటేశ్వర్లు, ఉదగాని సంతోష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమికి పట్టాదారు పాసుబుక్కులు ఇవ్వాలి

తహసీల్దార్ వినతి పత్రం అందజేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

భువనగిరికలెక్టరేట్, మే 28 : ప్రభుత్వ భూమిని సేద్యం చేసుకుంటున్న14 దళిత (మాదిగ) కుటుంబాలకు వెంటనే పట్టాదారు పాసుబుక్కులు ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొండమడుగు నర్సింహ్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం పట్టాదారు పాసుబుక్కుల సాధన కమిటి ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలియజేసిన అనంతరం తహసీల్దార్ యన్. అంజిరెడ్డికి వినతి పత్రం అందజేసి మాట్లాడారు. మండలంలోని హన్మాపురం గ్రామం సర్వేనెంబర్ 87లోని 15 ఎకరాల 12 గుంటల భూమిని గత 60, 70 సంవత్సరాలుగా 14 దళిత కుటుంబాలు ప్రభుత్వ భూమిని సేద్యం చేసుకొని బతుకుతున్నారని అన్నారు. ఆనాటి నుండి నేటి వరకు అనేకమార్లు ప్రభుత్వ అధికారులు, స్థానిక శాసనసభ్యులు, మంత్రులకు పట్టా సర్టిఫికెట్లు ఇవ్వాలని, సేద్యం చేసుకున్నట్లు రికార్డులో పేర్లు నమోదు చేయాలని దరఖాస్తులు పెట్టుకొని ఆఫీసులో చుట్టూ తిరుగుతున్నా నేటికీ పట్టాదారు పాసుబుక్కులు ఇవ్వలేదని ఆవేదన వెలిబుచ్చారు. ఇప్పటికైనా వెంటనే పట్టాదారు పాసుబుక్కులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జీఎంపీఎస్ జిల్లా అధ్యక్షులు దయ్యాల నర్సింహ్మ, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పల్లెర్ల అంజయ్య, పట్టాదారు పాసుబుక్కుల సాధన కమిటీ కన్వీనర్ ముడుగుల బాల్‌రాజు, కో-కన్వీనర్ ముడుగుల పరమేష్, సాగుదారులు ముడుగుల బాల్‌నర్సింహ, ముడుగుల రమేష్, ముడుగుల ఉపేందర్, బుచ్చాల కొండలు, బండారి సుధాకర్ పాల్గొన్నారు.